క్లుప్తంగా

వేణుగోపాలుని సేవలో తెలంగాణ మంత్రి తుమ్మల



తిరువూరు: నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం దర్శించుకున్నారు. వేణుగోపాలుడికి మంత్రి విశేష పూజలు నిర్వహించారు. మంత్రికి ఆలయ సహాయ కమిషనర్ జయప్రకాష్‌బాబు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నోటీసు

నూజివీడు: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొంటున్నామని మున్సిపల్ కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డికి సమ్మె నోటీసును అందజేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ దేశంలోని పెట్టుబడి వర్గాల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం తెచ్చే లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని, వీటిని రద్దు చేయాలని కార్మికలోకం గళమెత్తుతోందన్నారు. జయలక్ష్మి, రజనీ, ఏసు, గోవింద్, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



తిరువూరు: గంపలగూడెం మండలం నెమలి వద్ద తెలంగాణ నుంచి వస్తున్న ఒక లారీలో ఏడు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మినీ వ్యానులో జయంతి గ్రామానికి చెందిన ఒక వ్యాపారి ఈ బియ్యాన్ని తెలంగాణ నుంచి తీసుకువస్తున్నట్లు భావిస్తున్నారు. రెవెన్యూ శాఖకు సమాచారం ఇచ్చి తదుపరి విచారణ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నతమైనవి



మైలవరం: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు మహోన్నతమైనవని ఎస్ఎస్‌కే ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ సామాజిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎం. ప్రకాష్‌బాబు అన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం ఆయన మాట్లాడుతూ భారతదేశం చరిత్ర, ప్రాచీన భారతదేశ సాంస్కృతిక, భౌగోళిక నైసర్గిక స్వరూపం తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల నుంచి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ ఆక్రమణ
రోడ్డుపై మురుగునీటి ప్రవాహం



ఆగిరిపల్లి: అడవినెక్కలం గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా డ్రెయినేజీని ఆక్రమించుకుని దుకాణాల ఏర్పాటు చేశారు. గ్రామంలోని మురుగు నీరును చెరువుల్లోకి వెళ్లే విధంగా పంచాయతీ అధికారులు డ్రెయినేజీ ఏర్పాటు చేశారు. కొందరు అంబేడ్కర్ విగ్రహం దగ్గర డ్రెయినేజీని పూడ్చి వేసి పక్కనే రేకుల షెడ్డుతో రెండు దుకాణాలను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలోని మురుగునీరు మొత్తం విజయవాడ ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. మురుగునీరు వాహనదారులపై పడటంతో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు: నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 15న నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ఆదాయం ఘనం.. సేవలు శూన్యం

- ఏటా రూ. 3.50 కోట్ల ఆదాయం
- సెస్సు వసూలుకే కమిటీ ప్రాధాన్యం
- రైతులకు అందని సేవలు
- నూజివీడు ఏఎంసీ పనితీరుపై అసంతృప్తి



నూజివీడు వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని గోడౌన్



నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ

నూజివీడు: నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఆదాయం ఘనంగా ఉన్నప్పటికీ రైతులకు అందించాల్సిన సేవలు మాత్రం శూన్యం. రైతులకు ఎన్నో సేవలు అందించాల్సిన వ్యవసాయ మార్కెట్ కమిటీ వాటన్నింటినీ పక్కన పెట్టి కేవలం సెస్ వసూలు చేసేందుకే అన్నట్లుగా వ్యవహరిస్తోంది. ప్రతి ఏటా రూ.3.50 కోట్ల ఆదాయం వస్తున్నా రైతులకు అందులో పదో వంతు కూడా సేవలు అందిస్తున్న దాఖలాలు లేవు. దాదాపు 6 వేల టన్నుల సామర్థ్యమున్న గోడౌన్లు ఉండి, సొంత కార్యాలయం ఉన్నప్పటికీ రైతులకు సేవలు అందించాల్సిన కమిటీ సెస్సు వసూలుకు మాత్రమే పరిమితమైంది.

2024-25లో ఆదాయంలో రాష్ట్రంలో తృతీయస్థానం

నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలు నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోకి వస్తాయి. నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించి గత నాలుగేళ్ల ఆదాయాన్ని పరిశీలిస్తే ప్రతి ఏటా రూ.3.50 కోట్లు వస్తుండగా.. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మాత్రం రూ.5.07 కోట్లు ఆదాయం వచ్చి రాష్ట్రంలోనే తృతీయ స్థానంలో నిలిచింది. మామిడి, ధాన్యం, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలపై మార్కెట్ సెస్సు వసూలు చేయడం ద్వారా ఈ ఆదాయం సమకూరుతోంది. ఈ మార్కెట్ కమిటీ పరిధిలో ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం అడ్డ రోడ్డు వద్ద, నూజివీడు మండలం లీలానగర్ అడ్డరోడ్డు వద్ద, సీతారామపురం వద్ద చాట్రాయి మండలం చనుబండ వద్ద శాశ్వత చెక్‌పోస్టులు ఉన్నాయి. ముసునూరు మండలం వలసపల్లి, బలివే, చాట్రాయి మండలం పర్వతాపురం, మంకొల్లు వద్ద తాత్కాలిక చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. ఈ చెక్‌పోస్టుల ద్వారా వ్యవసాయోత్పత్తుల నుంచి సెస్‌ను వసూలు చేస్తున్నారు. అలాగే నూజివీడులో 3,200 టన్నులు, ఆగిరిపల్లిలో 2,800 టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్లు ఉన్నాయి.

గోడౌన్ల ద్వారా రూ.15 లక్షల ఆదాయం

నూజివీడులో 400 టన్నుల సామర్థ్యం ఉన్న గోడౌన్ ఒకటి, 600 టన్నుల సామర్థ్యం ఉన్న గోడౌన్లు మూడు, వెయ్యి టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్ ఒకటి చొప్పున ఉన్నాయి. అలాగే ఆగిరిపల్లిలో 600 టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్లు మూడు, వెయ్యి టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్ ఒకటి చొప్పున ఉన్నాయి. వీటిలో రెండు గోడౌన్లు ఖాళీగా ఉండగా మిగిలిన వాటిని అద్దెకు ఇవ్వడంతో ప్రతి ఏటా మార్కెట్ కమిటీకి రూ.15 లక్షల ఆదాయం వస్తోంది. అలాగే సివిల్ సప్లయిస్ శాఖ నుంచి రూ.1.60 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

సేవలేవీ..?

మార్కెట్ కమిటీకి వచ్చే ఆదాయంలో ఉద్యోగుల జీతభత్యాలు, నిర్వహణ పోగా మిగిలిన నిధులతో రైతులకు సంబంధించి పలు కార్యక్రమాలు నిర్వహించాలి. వ్యవసాయ శిబిరాలు, పశు వైద్య శిబిరాల నిర్వహణ, వ్యవసాయ భూముల్లోకి నూతన రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. గతంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులతో గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లోకి వెళ్లే రోడ్లను అభివృద్ధి చేసేవారు. కాని నేడు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు వచ్చే నిధులన్నింటినీ ప్రభుత్వం తీసేసుకుంటోంది. దీంతో మార్కెట్ కమిటీలు అలంకారప్రాయంగా మారాయి.

వేధిస్తోన్న సిబ్బంది కొరత

నూజివీడు మార్కెట్ కమిటీలో సిబ్బంది కొరత కూడా నెలకొంది. మొత్తం 21 పోస్టులకు గాను ఆరుగురు మాత్రమే రెగ్యులర్ సిబ్బంది ఉన్నారు. ఎల్‌డీసీ 1, టైపిస్ట్ 1, అసిస్టెంట్ మార్కెటింగ్ సూపర్‌వైజర్ 1, జూనియర్ మార్కెటింగ్ సూపర్‌వైజర్లు 4, వాచ్‌మెన్లు 7, అటెండర్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాచ్‌మెన్, అటెండర్ పోస్టుల్లో మాత్రం అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించుకుంటున్నారు.

ఆదాయం పెంపునకు కృషి చేస్తున్నాం



గత ఏడాది టార్కెట్ కంటే అధికంగా ఆదాయం రావడంతో నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఈ ఏడాది టార్కెట్‌ను భారీగా పెంచారు. పెంచిన టార్గెట్‌ను చేరుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నాం.

– యు.మహాలక్ష్మి,
ఏడీఎం, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ, నూజివీడు

19న నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నిక

తిరువూరు: ఇటీవల తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి రాజీనామా చేయడంతో ఆ పదవికి ఈ నెల 19న తిరిగి ఎన్నిక నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారని నగర పంచాయతీ అధికారులు తెలిపారు. ఎన్నికల సంఘం నియమావళి కనుగుణంగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు వారు చెప్పారు.

చైర్‌పర్సన్ ఎన్నికకు పీఓగా ఆర్డీఓ

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ పదవికి ఈ నెల 19న జరుగనున్న ఎన్నికకు తిరువూరు ఆర్డీఓ కె. మాధురి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. 19న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్లో జరుగనున్న ఎన్నికల ప్రక్రియకు హాజరు కావాలని 20 వార్డుల కౌన్సిలర్లకు, ఎక్స్ అఫీషియో సభ్యులు, ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు నోటీసులు అందజేశామని ఆర్డీఓ చెప్పారు.

నేడు ప్రజా దర్బార్

చాట్రాయి: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహిస్తామని ఎంపీడీఓ ఐ.విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు మంత్రి కొలుసు పార్థసారథి సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గత ప్రజా దర్బార్‌లో 91 సమస్యలు పెండింగ్

గత డిసెంబర్ 3, 4 తేదీల్లో గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో 173 అర్జీలు రాగా పలు శాఖల ద్వారా 82 సమస్యలు పరిష్కరించామని చెప్పారు. ఇంకా 91 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

జగన్‌కు వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వివాహ ఆహ్వాన పత్రిక అంజేస్తున్న జోగి రమేష్ దంపతులు, కుటుంబ సభ్యులు

ఇబ్రహీంపట్నం: తమ కుమారుడి వివాహానికి హాజరు కావాలని మాజీ మంత్రి జోగి రమేష్, శకుంతలమ్మ దంపతులు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో జోగి రమేష్ దంపతులు, కుటుంబ సభ్యులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 28న తమ పెద్ద కుమారుడు జోగి రాజీవ్ వివాహ వేడుక తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటలో జరుగుతుందని, 29న ఇబ్రహీంపట్నంలో రిసెప్షన్ వేడుక జరుగుతుందని జోగి రమేష్ చెప్పారు. వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు తప్పనిసరి



మట్టి నమూనాలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి

చాట్రాయి: ప్రతి రైతూ తమ భూముల్లోని మట్టిని పరీక్ష చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. బుధవారం మండలంలోని సోమవరం గ్రామంలో నిర్వహించిన మట్టి నమూనాల సేకరణను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎకరంలో నాలుగు నుంచి ఆరు చోట్ల వి ఆకారంలో 15 సెంటీ మీటర్ల లోతులో కిలో మట్టిని తీసుకుని ఎండలో ఆరబెట్టి మెత్తగా చేసి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షలు చేయించుకోదలచిన వారు తమ భూముల్లో గుట్టలు, నీరు నిల్వ ఉన్న ప్రదేశం, పిడుగు పడిన చోట, చెట్ల నీడ కింద, ఎరువు కుప్పలు వేసిన ప్రదేశాల్లో మట్టి నమూనాలను తీయవద్దని ఆయన సూచించారు. ఈ పరీక్షల వలన భూమిలో నత్రజని, భాస్వరం, పొటాషియం, జింకు, సేంద్రియ కర్బన పదార్థాలు సమపాళ్లలో ఉన్నదీ, లేనిదీ తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి. శివశంకర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

పెనుగంచిప్రోలు: గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు అన్నారు. బుధవారం కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.శ్యామ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ వర్క్స్, ఎలక్ట్రీషియన్స్, డ్రైవర్లు తదితర విభాగాల్లో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులు ఉన్నారన్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.10,500 వేతనంతో వారు కుటుంబాలను పోషించుకోవటం కష్టంగా మారిందన్నారు. పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు కలెక్టర్ ఆధ్వర్యంలోని వేతనాల కమిటీ నిర్ణయించిన దాని ప్రకారంవేతనాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టర్ మారినా కార్మికులను మార్చకూడదని, ప్రస్తుతం పనిచేస్తున్న వారిని కొనసాగించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులందరికీ యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు, తప్పని సరిగా అందించాలన్నారు. కార్మికుల జీతాలు పెంచకపోతే కార్మికులందరినీ కలుపుకుని సమ్మె చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు, పంచాయతీ కార్మికులు వీరబాబు, రాంబాబు, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొణకంచి(పెనుగంచిప్రోలు): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆయుర్వేద వైద్యాధికారి కె.వాణి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో గ్రామస్తులు, విద్యార్థులకు యోగా శిక్షకులు సురేష్, మణి యోగాసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా, ధ్యానం వలన శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!



విస్సన్నపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం బుధవారం జరిగింది. 1999–2000 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు దేశ, విదేశాల్లోని వివిధ ప్రాంతాల్లో, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారు పాఠశాల ఆవరణలో సమావేశమై తమ గత అనుభవాలను పంచుకున్నారు. ఎన్నాళ్లకెన్నాళ్లకు కలిశామంటూ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. క్షేమ సమాచారం అడిగి తెలుసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. గత స్మృతులను తలచుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. విస్సన్నపేట సర్పంచి సాదుపాటి నాగమల్లేశ్వరి, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విత్తనాలను అందుబాటులో ఉంచాలి

విస్సన్నపేట: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నందున రైతులకు కావలసిన అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని విస్సన్నపేట వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి విత్తన డీలర్లకు సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఎరువులు, విత్తనాల డీలర్ల సమావేశం బుధవారం నిర్వహించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు విధిగా బిల్లులు ఇవ్వాలని, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువుల ధరల పట్టికలను ప్రతి దుకాణం ఎదుట ఏర్పాటు చేయాలని, స్టాకు రిజిస్టర్లు తప్పనిసరిగా నిర్వహించాలని చెప్పారు.

ముగిసిన శిక్షణ తరగతులు

మైలవరం: మహిళల ఆర్థిక అభివృద్ధికి శిక్షణా తరగతులు దోహదపడతాయని కాటంనేని వెంకటేశ్వరరావు అన్నారు. మైలవరం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్, మోస్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కంప్యూటర్, టైలరింగ్, మగ్గం డిజైనర్ వర్క్, బ్యూటీషియన్ శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. మోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్‌లో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన భూక్యా హరిణికి నీట్ కోచింగ్ నిమిత్తం రూ.10 వేల చెక్‌ను ట్రస్టు సభ్యులు అందజేశారు. మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మోస్ట్ ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ సూరిమంచి వసుకుమార్, ట్రస్ట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలను భవిత కేంద్రాల్లో చేర్పించాలి



ముసునూరు: దివ్యాంగ బాలలలను భవిత కేంద్రాల్లో చేర్పించాలని ఎంపీడీఓ బీపీ సత్యనారాయణ పేర్కొన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో దివ్యాంగ బాలలను పాఠశాలల్లో చేర్పించాలని వివరిస్తూ చేపడుతున్న సర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులను, వారి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరించాలని సిబ్బందికి సూచించారు. సచివాలయ విద్యా సంక్షేమ సహాయకులు, ఐఈఆర్ టీచర్లు ఎంవీ లక్ష్మీనారాయణరావు, జె.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన



తిరువూరు: డీఎస్సీ 2025 నోటిఫికేషన్‌తో నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ తిరువూరులో బుధవారం నిరుద్యోగ అభ్యర్థులు ఆందోళన నిర్వహించారు. స్థానిక బోస్ సెంటర్‌లో ధర్నా చేసిన సందర్భంగా పలువురు అభ్యర్థులు ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 2024 ఫిబ్రవరిలో విడుదల చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా తాము దరఖాస్తు చేసుకోగా, ఇప్పుడు వయో పరిమితి దాటిపోయిందని అనర్హులుగా ప్రకటించడం గర్హనీయమన్నారు. వయోపరిమితిని తెలంగాణలో వలే 47 సంవత్సరాలకు పెంచాలని, పరీక్షకు సిద్ధమవడానికి కనీసం 3 నెలల సమయం ఇవ్వాలని కోరారు. జిల్లాకు ఒక పేపర్ విధానం ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కార్మికుల హక్కులు, కనీస వేతనాల అమలు కోసం ఈనెల 20న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కొండపల్లి ఐడీఏలో కార్మికులతో కలిసి బుధవారం ఆయన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 1992 సుప్రీం కోర్టు తీర్పు మేరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికుల హక్కులు కాలరాసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్, హెచ్‌పీసీఎల్ ఆయిల్ సెక్టార్ నాయకులు రాజశేఖర్, శేఖర్, బాబు నాయక్, గాంధీ, పిచ్చయ్య, కార్మికులు పాల్గొన్నారు.

నూజివీడు: నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకు, కనీస వేతనం రూ.26 వేల సాధనకై ఈ నెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని అమర్‌భవన్‌లో ఏఐటీయూసీ నూజివీడు శాఖ సమావేశం బుధవారం అధ్యక్షుడు అక్కినేని రాజా అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, తోట వెంకటరావు, వాకా రాంబాబు, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఇనుప స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదం



కుంటముక్కల గురుకుల పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ఇనుప స్తంభాలు

జి.కొండూరు: కుంటముక్కల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతి ఏటా 640 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. వర్షాకాలంలో ఈ ఇనుప స్తంభాలకు విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున పాఠశాలలో బాలికలు ప్రమాదవశాత్తూ స్తంభాలను తాకితే ప్రాణ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ కావడంతో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు వచ్చి పాఠశాలలో ఫ్యాన్లు, లైట్లు పనిచేయకుండా పోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సెలవు రోజులు కావడంతో ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతుంది. దీనిపై పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మిని వివరణ కోరగా విద్యుత్ స్తంభాల రీప్లేస్‌మెంట్ కోసం ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామని చెప్పారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



మైలవరం: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జె. సుశీలాదేవి అన్నారు. రెడ్డిగూడెంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం విస్సన్నపేట ఫైర్ స్టేషన్ సిబ్బంది రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య, వ్యవసాయ, ఐకేపీ సిబ్బంది ప్రజలతో కలిసి మాక్ డ్రిల్ డెమో నిర్వహించారు. అనుకోకుండా గ్యాస్ లీకై మంటలు చెలరేగినప్పుడు మహిళలు, కుటుంబ సభ్యులు మంటలు ఎలా ఆర్పాలి, ఒకవేళ చేతులు, ఇతర శరీర భాగాలు మంటల్లో కాలినప్పుడు వారిని ఎలా రక్షించుకోవాలి అనే 10 అంశాలపై ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. అక్కడ ఉన్న అన్ని ప్రభుత్వ విభాగాల సిబ్బందితో ముఖాముఖి నిర్వహించారు. ఎంపీడీఓ రమణ, డాక్టర్ మణిబాబు, డెప్యూటీ తహసీల్దార్ సతీష్ కుమార్, ఏఓ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.